క్లుప్తంగా

పంచాయతీలను అభివృద్ధి పథంలో నడిపించాలి



ఉంతకల్లులో సంపద తయారీ కేంద్రంలో ఎరువును పరిశీలిస్తున్న డీపీఓ నాగరాజు

బొమ్మనహాళ్: చెత్త నుంచి సంపద సృష్టిస్తే గ్రామ పంచాయతీలకు అదనపు ఆదాయం సమకూరుతుందని జిల్లా పంచాయతీ రాజ్ అధికారి నాగరాజు నాయుడు తెలిపారు. మంగళవారం మండలంలోని శ్రీధరఘట్ట, ఉంతకల్లు, దర్గా హొన్నూరు తదితర గ్రామాల్లో చెత్త సంపద తయారీ కేంద్రాలను పరిశీలించారు. ఈ సందర్భంగా డీపీఓ నాగరాజు నాయుడు మాట్లాడుతూ గ్రామ స్థాయిలో పూర్తిగా చెత్త సేకరణ లక్ష్యంగా పని చేయాలన్నారు. గ్రామస్తులు రోజూ సేకరించిన తడి,పొడి చెత్తతో పాటు ప్రమాదకర చెత్తను వేర్వేరుగా చెత్త సేకరించే సిబ్బందికి అందించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ దాస్, సర్పంచులు ముక్కన్న, శంకుతలమ్మ, పంచాయతీ కార్యదర్శి శివన్న, పల్లవి, వెంకటేష్ పాల్గొన్నారు.

దివ్యాంగులకు ఇంటి వద్దకే రేషన్

కూడేరు: దివ్యాంగులు, మంచానికి పరిమితమైన వారికి, 65 ఏళ్ల పైబడిన వారికి ఇంటి వద్దకే రేషన్ సరుకులను అందించనున్నట్లు సీఎస్‌డీటీ లక్ష్మీదేవి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ మండల వ్యాప్తంగా 1,670 మంది 65 ఏళ్లుపైబడిన, దివ్యాంగులున్నారని తెలిపారు.

యోగాతో జ్ఞాపకశక్తి పెంపు

కూడేరు: చిన్నప్పటి నుంచి పిల్లలు యోగాసనాలు చేస్తే మెదడు చురుగ్గా పని చేస్తూ జ్ఞాపకశక్తి పెరుగుతుందని గ్రంథాలయాధికారిణి రాధా రాణి అన్నారు. కూడేరు గ్రంథాలయంలో సమ్మర్ క్యాంపు కొనసాగుతోంది. మంగళవారం పిల్లలకు యోగాపై శిక్షణ ఇచ్చారు. గ్రంథాలయ సిబ్బంది ఆరుద్ర, పిల్లలు, పాఠకులు పాల్గొన్నారు.

ఉన్నత చదువుతోనే భవిష్యత్

కూడేరు: ఆడపిల్లలు బాగా చదువుకుంటేనే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని ఐసీడీఎస్ సీడీపీఓ శ్రీదేవి అన్నారు. మంగళవారం కమ్మూరులో కిశోరి వికాసం - వేసవి సెలవులు కార్యక్రమంలో భాగంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో 'ఆడపిల్లలు ఉన్నత శిఖరాలకు చేరుకోవడం ఎలా' అనే అంశంపై అవగాహన కల్పించారు. సీడీపీఓ శ్రీదేవి మాట్లాడుతూ బాల్య వివాహాలు ఎక్కడైనా జరిగితే అడ్డుకోవాలని, 1098 టోల్ ఫ్రీ నంబర్‌కు సమాచా రం ఇవ్వాలని ఆమె తెలియజేశారు. కార్యక్రమంలో ఏసీడీపీఓ ఎల్లమ్మ, సూపర్‌వైజర్లు రాజేశ్వరి, అరుణ, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశా వర్కర్లు, కిశోరి బాలికలు పాల్గొన్నారు.

దళిత యువకుడిని చితకబాదిన పోలీస్ అధికారి?

కళ్యాణదుర్గం రూరల్: మండలంలోని దూదర కుంటకు చెందిన గంగాధర్ అనే దళిత యువకుడిని కళ్యాణదుర్గం రూరల్ స్టేషన్‌లో పనిచేసే ఓ పోలీస్ అధికారి మంగళవారం చితకబాదాడు. గ్రామంలో నిరుపయోగం ఉన్న నీటి తొట్టిపై రాళ్లు విసిరాడన్న కారణంతో అదే గ్రామానికి చెందిన అగ్రకులానికి చెందిన ఓ నాయకుడు ఆదేశాల మేరకు దళిత యువడిని పోలీస్ అధికారి చితకబాదినట్లు సమాచారం. తప్పు జరిగిందో లేదో విచారణ కూడా చేయకుండా కేవలం ఓ నాయకుడు ఆదేశించాడని యువకుడిపై దాడి చేయడం తగదని దళిత సంఘాల నాయకులు ఆర్‌కే రాజు, చెలిమప్ప ఖండించారు. పోలీస్ అధికారిపై చర్యలు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళనలు చేస్తామని వారు హెచ్చరించారు.

యువకుడికి తీవ్ర గాయాలు

వజ్రకరూరు: రాగులపాడు వద్ద మంగళవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ప్రసన్నకుమార్ అనే యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. గుంతకల్లు మండలం ములకలపెంటకు చెందిన ప్రసన్నకుమార్ ద్విచక్ర వాహనంపై ఉరవకొండకు వెళ్లి తిరిగి గుంతకల్లుకు వెళ్తుండగా మార్గమధ్యలో రాగులపాడు వద్ద జింక అడ్డం రావడంతో కిందకు పడ్డాడు. మెరుగైన చికిత్స నిమిత్తం కర్నూల్ ఆసుపత్రికి తరలించారు. వజ్రకరూరు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మోసపూరిత హామీలతో వంచించిన చంద్రబాబు



వై.శివరామిరెడ్డి, ఎమ్మెల్సీ

ఉరవకొండ: మోసపూరిత వాగ్దానాలతో ప్రజలను వంచించి అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వాన్ని ప్రతి ఒక్కరూ నిలదీయాలని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి పిలుపునిచ్చారు. బుధవారం వజ్రకరూరు మండలం కొనకొండ్ల నుంచి ఓ ప్రకటన విడుదల చేశారు. ఎన్నికలకు ముందు ప్రజలకు అమలు సాధ్యం కాని సూపర్‌సిక్స్ హామీలు ఇచ్చి చంద్రబాబు మోసగించారన్నారు. ఏడాది పాలన పూర్తయినా ఒక్క హామీనీ నెరవేర్చలేదన్నారు. దీన్ని దృష్టిలో ఉంచుకొని ఈనెల 4న వెన్నుపోటు దినంగా ప్రకటిస్తూ వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేపడుతున్నట్లు తెలిపారు. నిరసన ర్యాలీలను జయప్రదం చేయాలన్నారు. వైఎస్సార్‌సీపీ హయాంలో ఏడాది లోపే అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 80 శాతం హామీలు అమలు చేసి చూపారన్నారు. గత ప్రభుత్వంలో 65 లక్షల మందికి పైగా పింఛన్లు అందిస్తుంటే కూటమి ప్రభుత్వం ఏడాదిలోనే 3.5 లక్షల మందికి కోత విధించిందన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో రూ.2.72 లక్షల కోట్లు డీబీటీ ద్వారా పేదలకు అందించారని గుర్తు చేశారు. చంద్రబాబు నయవంచన పాలనను గుర్తు చేస్తూ నేడు జరగబోయే నిరసన ర్యాలీలను పెద్ద ఎత్తున జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు.

నాడు సంక్షేమం.. నేడు సం'క్షోభం'

- ఏ పని కావాలన్నా.. ఊరు దాటాల్సిందే..!
- వైఎస్సార్‌సీపీ హయాంలో గడప గడపకూ అందిన సేవలు
- కూటమి ప్రభుత్వం ఏర్పాటయ్యాక పట్టణాలకు పరుగులు
- ఆర్‌ఎస్‌కేల్లో రైతులకు అందని విత్తనాలు, ఎరువులు



నాడు: ఇంటి వద్దకే పింఛన్ అందిస్తున్న వలంటీరు



నేడు: పింఛన్ కోసం ఎదురు చూస్తున్న వృద్ధులు

ఉరవకొండ: తాము అధికారంలోకొస్తే మెరుగైన పాలన అందిస్తాం.. ప్రగతిని పరుగులు పెట్టిస్తాం .. సూపర్‌సిక్స్ పథకాలు అమలు చేస్తాం.. అని ఇలా ఆర్భాటంగా ఎన్నో హామీలిచ్చిన కూటమి నేతలు.. అధికారంలోకి వచ్చి ఏడాది పూర్తయినా ఒక్కటంటే ఒక్క పథకమూ అమలు చేయలేక చేతులెత్తేశారు.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రజలు గడపగడపకూ పల్లెల్లోనే ప్రభుత్వ కార్యాలయాలు వెలిశాయి.. అర్హులందరికీ సంక్షేమ పథకాలు, పల్లెల్లోనే అన్ని రకాల సేవలూ అందాయి.. ఠంఛనుగా పింఛన్లు అందాయి.. ప్రభుత్వ బడుల రూపురేఖలు మారాయి.. కార్పొరేట్ వైద్యసేవలందాయి.. ఇళ్ల వద్దకే రేషన్ అందించింది.. ఇలా ఎన్నో సేవలు గ్రామ సచివాలయాల ద్వారా అందించి, ఆదర్శ పాలనకు నిలువుటద్దంగా నిలిచింది.. కూటమి ఏర్పాటయ్యాక పారదర్శక, ప్రజా రంజక పాలనకు మంగళం పాడింది. గ్రామ సచివాలయాల పరిధిలో 545 పౌర సేవలుండగా ఇందులో 400 వరకు గ్రామాల్లోనే అందుబాటులో ఉండేవి. ఏ సేవలు కావాలన్నా వలంటీర్ల ద్వారా అందేవి. జగనన్నకు చెబుదాం అనే కార్యక్రమం ద్వారా గ్రామాల్లో సమావేశాలు నిర్వహించి, ఎక్కడికక్కడ సమస్యలు పరిష్కరించేవారు.

నాడు పింఛన్ పంపిణీ ఇలా...నేడు ఇలా.

మంచానికే పరిమితమైన రోగులకు ఇంటివద్దకే వలంటీరు వెళ్లి పింఛన్ అందించేది. ప్రస్తుతం పింఛన్‌దారుడిని సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాల వద్దకు రప్పించి పింఛన్ అందిస్తున్నారు. కొత్త విద్యాసంవత్సరంలో విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్లు కోసం మండల కేంద్రాలకు వెళ్లాల్సి వస్తోంది. దీంతో పాటు రేషన్ బియ్యాన్ని నాడు ఇంటివద్దకే ఎండీయూ వాహనాల ద్వారా అందించేవారు. నేడు రేషన్ షాపుల వద్ద క్యూలైన్లో గంటల తరబడి నిలొంయరి వేచి చూడాల్సిన దుస్థితి వచ్చింది.

రైతన్నలకు తప్పని తిప్పలు:

రైతులకు గతంలో రైతు భరోసా కేంద్రాల ద్వారా ఎరువులు, నాణ్యమైన విత్తనాలు, పంటల సాగుకు సలహాలు, సూచనలు, క్షేత్రస్థాయిలో రైతులకు ఉచిత శిక్షణ, ఉచిత పంటల బీమా తదితర సేవలు అందాయి. తద్వారా నియోజకవర్గంలోని 80 వేల మంది రైతులకు లబ్ధి కలిగింది. దీంతో పాటు ఉరవకొండ మార్కెట్‌యార్డు ప్రాంగణంలో రూ.50 లక్షలతో వైఎస్సార్ అగ్రిల్యాబ్ నిర్మించారు. రైతులకు 9గంటలకు నాణ్యమైన విద్యుత్ కోసం రూ.75 కోట్లతో విద్యుత్ సబ్‌స్టేషన్లు మంజూరయ్యాయి. ప్రస్తుత కూటమి పాలనలో రైతులకు పట్టించుకునే నాథుడే కరువయ్యారు. విత్తనాలు, ఎరువులు, క్రిమిసంహారక మందులు అందక రైతులు అవస్థలు పడుతున్నారు.

ఐదేళ్ల వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధి, సంక్షేమానికి చేసిన ఖర్చు వివరాలు..

ఉరవకొండ నియోజకవర్గ జనాభా: 3.41 లక్షలు
మొత్తం ఓటర్ల సంఖ్య: 2,15,481

- నియోజకవర్గంలో సంక్షేమ పథకాలకు రూ.2,500 కోట్లు
- నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు రూ.1000 కోట్లు
- నాన్ డీబీటీ ద్వారా 1.93 లక్షల మందికి రూ.595 కోట్లు
- మొత్తం 84 గ్రామ సచివాలయాలకు రూ.34.95 కోట్లు
- 25 రకాల సంక్షేమ పథకాలకు డీబీటీ ద్వారా రూ.1920 కోట్లు
- డీబీటీ, నాన్ డీబీటీ ద్వారా లబ్ధి రూ. 3,500 కోట్లు
- ఆర్‌బీకే, సచివాలయాలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌ల నిర్మాణానికి ఖర్చు రూ.41 కోట్లు
- గడప గడపకూ మన ప్రభుత్వం ద్వారా రూ.20 లక్షలతో అభివృద్ధి పనులు



నాడు: ఇంటి వద్దకే రేషన్ అందుకుంటున్న రేషన్ కార్డు లబ్ధిదారులు



నేడు: రేషన్ షాపు వద్ద రేషన్ బియ్యం కోసం క్యూలైన్లో కార్డులు పెట్టి వేచి చేస్తున్న కార్డుదారులు



నాడు: ఆర్‌బీకే వద్దే రైతులకు వేరుశనగ విత్తనాలు, ఎరువులు అందిస్తున్న అధికారులు



నేడు: చిన్నముష్టూరులో సేవలు అందించలేక నిరుపయోగంగా ఉన్న ఆర్‌ఎస్‌కే

ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలి



ఆర్‌ఎంపీలతో మాట్లాడుతున్న వైద్యాధికారి డాక్టర్ శ్రావణ్‌కుమార్

బొమ్మనహాళ్: ఆర్‌ఎంపీలు ప్రథమ చికిత్స మాత్రమే చేయాలని ఇన్‌చార్జ్ పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రావణ్‌కుమార్ హెచ్చరించారు. మంగళవారం మండలంలోని ఆర్‌ఎంపీలతో స్థానిక పీహెచ్‌సీలో సమావేశం నిర్వహించారు. డాక్టర్ మాట్లాడుతూ ఆర్‌ఎంపీలు పరిధి దాటి వైద్యం చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం ప్రభుత్వం ఆస్పత్రులకు సిఫార్సు చేయాలని చెప్పారు. రెఫరల్ పేరుతో స్కానింగ్ సెంటర్లకు పంపుతున్నట్లు ఆర్‌ఎంపీలపై ఆరోపణలు ఉన్నాయన్నారు. అనుమతి లేకుండా ఆర్‌ఎంపీలు క్లినిక్‌లు నడిపితే చర్యలు ఉంటాయన్నారు. సీహెచ్‌ఓ ఈశ్వరయ్య, హెల్త్ సూపర్‌వైజర్ యుగేందర్ పాల్గొన్నారు.

మండలాభివృద్ధికి కృషి చేయండి



ఎంపీడీఓను కలిసిన నాయకులు

కణేకల్లు: ప్రజా సమస్యల పరిష్కారానికి, మండలాభివృద్ధి కోసం నిష్పక్షపాతంగా పని చేయాలని ఎంపీడీఓ విజయభాస్కర్‌రెడ్డిని వైఎస్సార్‌సీపీ నాయకులు కోరారు. మంగళవారం వైఎస్సార్‌సీపీ నాయకులు నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఎంపీడీఓను మర్యాదపూర్వకంగా కలిశారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆలేరి రాజగోపాల్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు మారెంపల్లి మారెన్న, జిల్లా కోశాధికారి పాటిల్ నాగిరెడ్డి, వైస్ ఎంపీపీ లీలావతి, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ పాటిల్ బ్రహ్మానందరెడ్డి, నాయకులు ఆలేరి లక్ష్మీకాంతరెడ్డి, కురుబ మల్లికార్జున, మారెంపల్లి మహేష్‌లు ఎంపీడీఓను కలిసి శాలువా కప్పి సన్మానించారు.

'వెన్నుపోటు దినం' ర్యాలీని విజయవంతం చేద్దాం



విశ్వేశ్వరరెడ్డి మాజీ ఎమ్మెల్యే



మెట్టు గోవిందరెడ్డి, మాజీఎమ్మెల్యే



తలారి రంగయ్య, మాజీ ఎంపీ

ఉరవకొండ: కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా సాగిస్తున్న వంచన పాలనకు ఏడాదయిన సందర్భంగా వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో బుధవారం ఉరవకొండలో జరిగిన 'వెన్నుపోటు నిరసన ర్యాలీ'ని జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే, పార్టీ సమన్వయకర్త వై.విశ్వేశ్వరరెడ్డి ఓ ప్రకటనలో పిలుపునిచ్చారు. ఉదయం 10 గంటలకు ఉరవకొండలోని ఉరగాద్రి కళ్యాణ మంటపం నుంచి వేలాది మందితో నిరసన ర్యాలీ ప్రారంభమవుతుందని, తహసీల్దార్ కార్యాలయం వరకు కొనసాగుతుందన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందించనున్నట్లు తెలిపారు. ప్రజాప్రతినిధులు, జెడ్పీటీసీ, ఎంపీపీలు, సర్పంచులు, ఎంపీటీసీలు, వార్డు మెం బర్లు, పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు.

రాయదుర్గం: రాయదుర్గం పట్టణంలో బుధవారం జరగనున్న చంద్రబాబు వెన్నుపోటు దినంపై చేపట్టనున్న నిరసన ర్యాలీని విజయవంతం చేద్దామని వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన తన స్వగృహంలో మాట్లాడారు. ఉదయం 10 గంటలకు పట్టణంలోని వినాయక సర్కిల్ వద్దకు నియోజకవర్గంలోని అన్ని గ్రామాల నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున చేరుకోవాలన్నారు. అక్కడి నుంచి పాత బస్టాండ్ దాటుకుని లక్ష్మీబజార్ మీదుగా తహసీల్దార్ కార్యాలయం వరకు కూటమి ఏడాది పాలన - ప్రభుత్వ వైఫల్యంపై ప్లకార్డులు చేతపట్టి ర్యాలీ నిర్వహిస్తామన్నారు.

కళ్యాణదుర్గం రూరల్: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది కావస్తున్నా ఇచ్చిన హామీలు అమలు చేయకుండా ప్రజలను మోసం చేశారని కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. కూటమి ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తి చేసుకున్న నేపథ్యంలో జూన్ 4న వెన్నుపోటు దినం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మాజీ ఎంపీ తలారి రంగయ్య ఆధ్వర్యంలో కళ్యాణదుర్గంలోని ఆర్డీటీ ఆస్పత్రి నుంచి ర్యాలీగా వెళ్లి ఆర్డీఓకు వినతి పత్రం అందజేయనున్నారు. వైఎస్సార్‌సీపీ శ్రేణులు భారీగా తరలివచ్చి కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని తలారి రంగయ్య పిలునిచ్చారు.

'వెన్నుపోటు దినం' నిరసన ర్యాలీకి తరలిరండి



ఎంపీపీ రమావత్‌దేవి

వజ్రకరూరు: ఉరవకొండలో ఈనెల 4న వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త విశ్వేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో చేస్తున్న వెన్నుపోటు దినం నిరసన ర్యాలీకి పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతంచేయాలని ఎంపీపీ రమావత్‌దేవి పిలు పునిచ్చారు. మంగళవారం మండల కేంద్రంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. 2024 సార్వత్రిక ఎన్నికల్లో కూటమి నాయకులు సూపర్‌సిక్స్ పథకాలపేరుతో ప్రజలను మభ్య పెట్టి ఓట్లు వేయించుకున్నా ర ని , అధికారంలోకొచ్చి ఏడాది పూర్తయినా ఏ ఒక్క హామీనీ అమలు చేయలేదన్నారు. కూటమి దగా పాలనను ఎండగడుతూ ఈనెల 4న వైఎస్సార్‌సీపీ ఆధ్వర్యంలో నిరసన ర్యాలీలు చేస్తున్నట్లు తెలిపారు.

ప్రతి ఒక్కరూ శుభ్రత పాటించాలి

ఉరవకొండ రూరల్: ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతోపాటు వ్యక్తిగత శుభ్రత అవసరమని రాకెట్ల పీహెచ్‌సీ వైద్యురాలు పావని తెలిపారు. మంగళవారం పీహెచ్‌సీలో ఆశా డే నిర్వహించారు. వైద్యురాలు పావని మాట్లాడుతూ కలుషిత ఆహారంతో అతిసార వ్యాధి ప్రబలుతుందన్నారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ షఫీ, సూపర్‌వైజర్లు శేఖర్, స్వర్ణలత, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

నేడు ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్ర ప్రారంభం



గొంచితండాలో సేవ్ ఆర్‌డీటీ పాదయాత్ర పోస్టర్లను ఆవిష్కరిస్తున్న తలారి రంగయ్య



కరపత్రాలు, జెండాలు ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బెళుగుప్ప: ఆర్డీటీ పరిరక్షణకు మాజీ ఎంపీ, వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త తలారి రంగయ్య మండలంలోని బ్రాహ్మణపల్లి తండా (గొంచితండా) నుంచి పాదయాత్ర బుధవారం ప్రారంభించనున్నారు. మంగళవారం నాయకులు, కార్యకర్తలతో కలిసి గొంచితండాలో ఏర్పాట్లను పరిశీలించారు. ముందుగా రంగయ్య ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్ర గురించి వివరించారు. అనంతరం గ్రామంలో ఆర్‌డీటీ పరిరక్షణ పాదయాత్ర జెండా, పోస్టర్లను పార్టీ నాయకులు, గ్రామస్తులతో కలసి ఆవిష్కరించారు. ఈకార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కార్యదర్శి బోయ తిప్పేస్వామి, కళ్యాణదుర్గం, బ్రహ్మసముద్రం, శెట్టూరు, కంబదూరు మండలాల పార్టీ కన్వీనర్లు గోళ్ల సూరి, చంద్రశేఖర్‌రెడ్డి, ఎమ్మెస్ రాయుడు, హనుమంతరాయుడు, నరసాపురం ఎంపీటీసీ సురేష్, రమనేపల్లి సర్పంచ్ రమేష్, నాయకులు గోపాల్, పార్టీ అనుభంద సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్ర జయప్రదం చేద్దాం

బ్రహ్మసముద్రం : ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్రను జయప్రదం చేద్దామని వైఎస్సార్‌సీపీ నాయకులు పిలుపునిచ్చారు. మంగళవారం మండల పరిధిలోని పడమటి కోడిపల్లిలో ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్ర జెండాలు, కరపత్రాలను విడుదల చేశారు. నాయకులు మాట్లాడుతూ బుధవారం సాయంత్రం బెళుగుప్ప మండలం గొంచితండా నుంచి మాజీ ఎంపీ తలారి రంగయ్య పాదయాత్ర చేస్తున్నారన్నారు. బ్రహ్మసముద్రం మండలంలో దాదాపు 3 రోజులు పాటు పాదయాత్ర కొనసాగుతుందని, పాదయాత్రలో పెద్ద ఎత్తున పాల్గొని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ పాలబండ్ల చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు గంగాధరప్ప, ఎంపీపీ కంభం చంద్రశేఖరరెడ్డి, జిల్లా పంచాయతీ రాజ్ విభాగం కార్యదర్శి గోపాల్‌రెడ్డి, మహేష్‌స్వామి, ఎరడికెర ఎర్రిస్వామి, సర్పంచ్ గంగాధర, ఎంపీటీసీ నరసింహ, నాయకులు హనుమంత, పాలయ్య, గోవింద, భద్ర, మంజు, సదాశివ, మంజు, వెంకి, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్డీటీ పరిరక్షణ పాదయాత్ర సాగేదిలా...

కళ్యాణదుర్గం: ఆర్డీటీని పరిరక్షించాలని, ఎఫ్‌సీఆర్‌ఏ పునరుద్ధరించాలని కోరుతూ బుధవారం చేపట్టనున్న మహా పాదయాత్ర రూట్‌మ్యాప్‌ను వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం సమన్వయకర్త డాక్టర్ తలారి రంగయ్య విడుదల చేశారు.

మొదటి రోజు 04.06.25న పాదయాత్ర సాగనుందిలా... గొంచితండా, రాయదుర్గం మెయిన్ రోడ్డు, కొత్త బ్రాహ్మణపల్లి, పాత బ్రాహ్మణపల్లి, నరసాపురం.

రెండోరోజు 05.06.25న కుర్లగుండ, బొమ్మగానిపల్లి తండా, బొమ్మగానిపల్లి, రాయలదొడ్డి.

మూడో రోజు 06.06.25న కన్నేపల్లి, ముద్దలాపురం , పిల్లలపల్లి, గొంచిరెడ్డిపల్లి.

నాల్గో రోజు 07.06.25న సూగేపల్లి, కోనాపురం, యాటకల్లు, మంగంపల్లి, చిన్నంపల్లి.

ఐదో రోజు 08.06.25న బచ్చేహళ్లి, కైరేవు, చెర్లోపల్లి.

ఆరో రోజు 09.06.25న లక్ష్మంపల్లి, కంబాలపల్లి, యర్రగుంట, జానంపల్లి, అపిలేపల్లి.

ఏడో రోజు 10.06.25న మండలపల్లి, కరిగానిపల్లి, తెనగల్లు.

ఎనిమిదోరోజు 11.06.25న ఎనుముల దొడ్డి, గురివేపల్లి, రుద్రంపల్లి, తిమ్మాపురం.

తొమ్మిదో రోజు 12.06.25న దేవరమానులు, మంద, కుర్లపల్లి, మేళ్లకుంట, రాళ్లపల్లి.

పదో రోజు 13.06.25 న రాళ్ల అనంతపురం, చెన్నేపల్లి, కర్తనపర్తి.

11వ రోజు 14.06.25న నూతిమడుగు, కడదరకుంట, పింజిరి కొట్టాల

12వ రోజు 15.06.25న బాల వెంకటాపురం, కదరంపల్లి, కొండాపురం, వెంకటంపల్లి.

13వ రోజు 16.06.25న ముద్దినాయనపల్లి, కాపర్లపల్లి, పీటీఆర్ పల్లి, వర్లి.

14వ రోజు 17.06.25న కోడిపల్లి, మల్లిపల్లి, ముదిగల్లు

15వ రోజు 18.06.25న బోరంపల్లి, చాపిరి, హులికల్లు, విట్లంపల్లి, మల్లికార్జునపల్లి.

16వ రోజు 19.06.25న గూబనపల్లి, కళ్యాణదుర్గం.

క్రీడల్లో గెలుపోటములు సమానంగా తీసుకోవాలి



భీమా లెవెన్ జట్టుకు నగదు, ట్రోఫీ అందిస్తున్న దృశ్యం

వజ్రకరూరు: క్రీడల్లో గెలుపోటములను సమానంగా తీసుకోవాలని ఎమ్మెల్సీ వై.శివరామిరెడ్డి తనయుడు, ఖోఖో అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు వై.భీమిరెడ్డి అన్నారు.ఈ క్రికెట్ టోర్నమెంట్‌ను వీరజవాన్ మురళీ నాయక్‌కు అంకితమిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని కొనకొండ్ల జెడ్పీహెచ్‌ఎస్ పాఠశాల మైదానంలో భీమిరెడ్డి జన్మదినం సందర్భంగా గ్రామస్తుల సహకారంతో భీమా యూత్ కొనకొండ్ల ఆధ్వర్యంలో గత నెల 12న ప్రారంభమైన 'భీమా సూపర్ ఛాలెంజ్ కప్ -2025 ' క్రికెట్ టోర్నమెంట్ మంగళవారం ముగిసింది. ఫైనల్‌లో చాబాల సాయి లెవెన్ జట్టు, కొనకొండ్ల భీమా లెవెన్ జట్లు తలపడ్డాయి. మొదట బ్యాటింగ్ చేసిన చాబాల సాయి లెవెన్ జట్టు నిర్ణీత 12 ఓవర్లలో 98 పరుగులు చేసింది. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన కొనకొండ్ల భీమా లెవెన్ జట్టు మూడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. కొనకొండ్ల భీమా లెవెన్ జట్టు బ్యాటర్ ఆకుల హరికృష్ణ అద్భుత బ్యాటింగ్‌తో కొనకొండ్ల జట్టు విజయానికి దోహదపడ్డాడు. అనంతరం జరిగిన కార్యక్రమంలో విన్నర్‌గా నిలిచిన భీమా లెవెన్ జట్టుకు రూ.40116 నగదు, ట్రోఫీ అందించారు. రన్నర్ జట్టు (చాబాల సాయి లెవెన్ జట్టు)కు రూ.20116 నగదు, ట్రోఫీ అందించారు. కార్యక్రమంలో ఎంపీటీసీలు పాపన్న, మునయ్య, మాజీ ఎంపీపీ రామచంద్ర, వైఎస్సార్‌సీపీ నాయకులు నంచర్ల లాలెప్ప, గ్రామపెద్దలు, ఆర్గనైజర్లు పాల్గొన్నారు.

బిల్లుల గోల్‌మాల్‌పై అధికారుల విచారణ



రైతులను విచారిస్తున్న విద్యుత్‌శాఖ డీఈఈ, ఏడీ

కణేకల్లు: విద్యుత్‌శాఖ కాంట్రాక్ట్ పనుల బిల్లుల గోల్‌మాల్‌పై కళ్యాణదుర్గం ఏపీఎస్‌పీడీసీఎల్ డీఈఈ రాజశేఖర్, ఉరవకొండ ఏడీ భాస్కర్ విచారించారు. కణేకల్లు మండలంలో 2021లో పలు వ్యవసాయ కనెక్షన్ పనులు జరిగాయి. ఆ సమయంలో కొన్ని పనులు కాంట్రాక్టర్ సుధాకర్ చేయగా, మరి కొన్ని పనులు మరో కాంట్రాక్టర్ దేవరాజు చేశాడు. కాంట్రాక్టర్ దేవరాజు పలుకుబడి ఉపయోగించి అధికారులతో చెక్ మెజర్మెంట్ చేయించి రూ.4లక్షలపైగా బిల్లులను బిల్లులు డ్రా చేసినట్లు సుధాకర్ విద్యుత్‌శాఖ సీఎండీకి ఫిర్యాదు చేశారు. ఈ బిల్లుల గోల్‌మాల్‌పై విచారణ చేయాలని సీఎండీ ఆదేశించిడంతో మంగళవారం డీఈఈ, ఏడీలు విచారణ చేపట్టారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లోని ఏఈఈ కార్యాలయంలో అధికారులు విచారణ చేశారు. 18 మంది రైతుల వ్యవసాయ పనులు సుధాకర్ చేశాడా? దేవరాజ్ చేశాడా? అనే విషయాన్ని నిగ్గుతేల్చడానికి విచారణకు రావల్సిందిగా అధికారులు రైతులకు ముందుగానే సమాచారమిచ్చారు. కేవలం ఐదుగురు రైతులు మాత్రమే హాజరయ్యారు. డీఈఈ, ఏడీలు వీరిని విచారించగా, తమ పనులను సుధాకర్ చేశారని అధికారులకు వివరించారు. విచారణ అనంతరం అధికారులు విలేకరులతో మాట్లాడారు. విచారణకు 13 మంది రైతులు హాజరు కాలేదని మరో మారు వారిని విచారిస్తామన్నారు. విచారణ నివేదికను సీఎండీకు అందజేస్తామన్నారు. విచారణ పూర్తి స్థాయిలో పూర్తయిన తర్వాతే ఏం జరిగిందనేది కొలిక్కి వస్తోందన్నారు.

సంక్షిప్త సమాచారం

అణచివేత ధోరణి తగదు

కళ్యాణదుర్గం రూరల్: అగ్ర కులాల వారికి దళితులను అణచివేసే ధోరణి తగదని దళిత సంఘాల నాయకులు అన్నారు. మంగళవారం పట్టణంలోని అంబేడ్కర్ సర్కిల్‌లో దళిత సంఘాల నాయకులు నిరసన తెలియజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ మండల పరిధిలోని బోరంపల్లి గ్రామంలో గత 40 ఏళ్లుగా శ్రీనాథ్‌రెడ్డి అనే వ్యక్తి స్టోర్ డీలర్‌గా ఉన్నారని, కూటమి ప్రభుత్వం ఏర్పాటయిన తర్వాత అదే గ్రామంలోని దళితుడు గోపాల్‌కు డీలర్‌గా ఇచ్చారన్నారు. అయితే తాము దళిత డీలర్ వద్ద రేషన్ తీసుకోవాలా? అంటూ అగ్రకులాల వారు కుట్ర పన్నుతున్నారన్నారు. కార్యక్రమంలో జన జాగృత అధ్యక్షుడు రాజు, గిరిజన సంక్షేమ సంఘం అధ్యక్షుడు తిప్పేనాయక్, ఎస్సీ, ఎస్టీ జేఏసీ తాలూకా అధ్యక్షుడు చెలిమప్ప, దళిత సంఘాల నాయకులు పాల్గొన్నారు.

ఖరీఫ్ సాగుపై రైతులకు అవగాహన

రాయదుర్గంటౌన్: వికసిత కృషి సంకల్ప అభియాన్ కార్యక్రమంలో భాగంగా జుంజురాంపల్లి, ఆవులదట్ల, కొండాపురం, వడ్రవన్నూరు గ్రామాల్లోని రైతు సేవా కేంద్రాల్లో ఖరీఫ్ సాగుపై రైతులకు మంగళవారం అవగాహన కల్పించారు. ఏడీఏ లక్ష్మానాయక్ ఆధ్వర్యంలో ఏఓ మహేంద్ర, ఉద్యావన శాఖ అధికారి యామిని, ఉద్యావన శాస్త్రవేత్తలు రైతులకు అవగాహన కల్పించారు. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన పంటల ఏర్పాట్లు, సాగు విధానాలు, ప్రభుత్వ పథకాలపై సమగ్ర సమాచారం అందజేశారు. భూసార పరీక్షల ఫలితాలు, విత్తనాల రాయితీ పంపిణీ, వ్యవసాయ పరికరాలు, అన్నదాతా సుఖీభవ, పీఎం కిసాన్ తదితర పథకాలపై వివరించారు. అంతేకాక కళ్యాణదుర్గం కేవీకే నుంచి హాజరైన చంద్రాయుడు కంది, వేరుశనగ పంటలలో వచ్చే పీడపీడలు, వాటి నివారణ, నీటి యాజమాన్యంపై సూచనలు చేశారు. కార్యక్రమంలో ఉద్యావన శాస్త్రవేత్త యుగంధర్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటా వైద్యసేవలు అందించాలి

గుమ్మఘట్ట: గ్రామీణ ప్రాంతాల్లో ఇంటింటా వైద్యసేవలు అందించాలని పీహెచ్‌సీ వైద్యులు బాలాజీనాయక్, రాం కిశోర్ తెలిపారు. మండల కేంద్రంలోని పీహెచ్‌సీలో ఏఎన్‌ఎం, ఎంఎల్‌హెచ్‌పీ, ఆశావర్కర్లతో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇంటింటికీ వెళ్లి గర్భిణులు, బాలింతలు,శిశువులకు మెరుగైన సేవలు అందించాలని సూచించారు. కార్యక్రమంలో సీహెచ్‌ఓ మురళీధర్, సూపర్‌వైజర్ ఆదిబయమ్మ, ఏఎన్‌ఎంలు, ఎంఎల్‌హెచ్‌పీలు పాల్గొన్నారు.

6న మండల సర్వసభ్య సమావేశం

గుమ్మఘట్ట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో ఈనెల 6న ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం జరుగుతుందని ఎంపీడీఓ రామకృష్ణ ఓ ప్రకటనలో తెలిపారు. ఎంపీటీసీ సభ్యులు, జెడ్పీటీసీ సభ్యుడు, సర్పంచులు ,కోఆప్షన్ సభ్యులు, మండల స్థాయి అధికారులు తప్పక హాజరు కావాలని ఆయన కోరారు.